ఆ రోజు
ప్రముఖ దినపత్రికలో
మధ్య పేజీలోని ఓ మూల
ప్రకటన ఇలాగుంది-

"మీరు డబ్బు ఎలా సంపాదించాలా అని బాధ పడుతున్నారా? అసలు పెట్టుబడే లేకుండా గొప్ప లాభాలను ఎలా సంపాదించవచ్చో తెలుసుకొనేందుకు మాకు వ్రాయండి. మా సలహాను తీసుకోండి.
మా చిరునామా...
ముఖ్యగమనిక: మా సలహాకై మీరు ఉత్తరం వ్రాయదలచిన, మీ చిరునామా పంపుట మరువకండి. దానితోపాటు ఓ ఇరువది ఐదు రూపాయిలు ఎం.ఓ. చేయడం మరువకండి."
అని.

** ** **

"మొత్తం ఎంతొచ్చిందిరా?"
"లక్షా పదిహేను వేల యాభై సార్"
'శభాష్ మాశావా! మనం పెట్టిన పెట్టుబడి అంటే, పేపరు అడ్వర్‌టైజ్‌మెంట్ కోసం మనం పెట్టిన డబ్బు ఐదొందలు. చూడు మనకెంత లాభమొచ్చిందో"
"గ్రేట్ గురూ.. ఇంత లాభమొస్తుందని నేను కలలో కూడా ఊహించలేదు"
"తప్పు శిష్యా.. మన రాష్ట్రంలో కేవలం ఏ కష్టాలు పడకుండా డబ్బు సంపాదించాలనుకునేవాళ్ళు ఇంత మందన్న మాట"

** ** **

అలా ఎం.ఓ. పంపినవాళ్ళందరికి కార్డులొచ్చాయి.
అందులో ఇలా రాసుంది-
"మీ ఇరువది ఐదు రూపాయిల మొత్తం అందింది. మహాశయా, వారంలో చిరంజీవి, కృష్ణల వంటి ప్రముఖుల సినిమాలు ఒకటి, రెండు తప్పక రిలీజ్ అవుతాయి. దానికి ముందుగానే మీరు కొన్ని టిక్కెట్లు కొని, దాన్ని కొంత ధర పెంచి బ్లాక్‌లో అమ్మండి. ఒక వేళ ఈ ఐడియా నచ్చకపోతే, గౌరవంగా 'మాలా' కూడా మీరు డబ్బు సంపాదించండి అని."
అది చదువుకున్న ధనాశాపరులంతా తేలుకుట్టిన దొంగల్లా డీలా పడిపోయారు.

— కందమూరి జనార్దన్




# సమాచారమ్

## వినతి

"స్త్రీకి కూడా శరీరం వుంది, దానికి వ్యాయామం యివ్వాలి
ఆమెకి మెదడు వుంది, దానికి జ్ఞానం యివ్వాలి
ఆమెకు హృదయం వుంది, దానికి అనుభవం యివ్వాలి"

అన్న కనీస దృక్పథంతో విస్తృతంగా కవిత్వం వెలువడడం ప్రారంభమైంది ఈ మధ్యకాలంలోనే. ఈ దృక్పథం నుంచి వివిధ పత్రికల్లో వెలువడుతున్న ఉత్తమ కవిత్వాన్ని యెంచి పుస్తక రూపంలో ప్రచురించదలిచాము. మీరు చదివిన కవిత్వం కాని, మీరు వ్రాసిన కవిత్వం కాని ఈ ప్రకటన వెలువడిన నెల రోజులలోగా పొయెట్రీ ఫోరమ్, 9-1-17, వేములవాడ, కరీంనగర్ జిల్లా- 505 302 చిరునామాకు పంపి పుస్తక ప్రచురణకు మాతో సహకరించవలసినదిగా కోరుచున్నాము.

— పొయెట్రీ ఫోరమ్, వేములవాడ

తెనాలి కెమేరా క్లబ్‌వారు నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ఏమెచ్యూర్ ఫోటోగ్రఫీ కాంపిటీషన్‌కు ఎంట్రీలు పంపుటకు ఆఖరు తేదిని 31-8-88 వరకు పొడిగించారు. కలర్ 8x10 సైజులోను బ్లాక్ అండ్ వైట్ 61/2 x 51/2 సైజుకు తగ్గకుండా నాలుగు ఎంట్రీలు చొప్పున ఈ క్రింది చిరునామాకు పంపాలి.
ఎంట్రీ ఫీజు లేదు.

వి. భాస్కరరావు
19-4-7, /ముత్తంశెట్టిపాలెం, తెనాలి

